



మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వి.పాటిల్

అర్హులకు.. సంక్షేమ ఫలాలు!

- ప్రతీ అర్హుడికి సంక్షేమ ఫలాలు అందేలా కృషి
- ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారెంటీల్లో రెండు అమలు
- ఉచిత బస్సుతో 27.75లక్షల మంది మహిళలకు లబ్ధి
- ప్రజాపాలనకు 2.94 లక్షల దరఖాస్తులు
- రూ.2లక్షల పంట రుణమాఫీ కోసం బ్యాంకులతో సంప్రదింపులు
- యువత ఉపాధి, ఉద్యోగ కల్పన కోసం ప్రత్యేక దృష్టి
- గణతంత్ర దినోత్సవ వేడుకల్లో కలెక్టర్ జితేష్ వి.పాటిల్

కామారెడ్డి, జనవరి 26(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రభుత్వం జిల్లాలో ప్రజలకు అందుబాటులో ఉండేవిధంగా పారదర్శక పాలన నడిచే ఉద్దేశ్యంతో ప్రజాపాలన కార్యక్రమాలను మొదలుపెట్టడం జరిగిందని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ అన్నారు. సమాజంలో అన్ని వర్గాలకు స్వేచ్ఛ, సామాజిక న్యాయం, సమాన అవకాశాలు దక్కలనేది ప్రభుత్వ లక్ష్యం ఈ నేపథ్యంలో ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చే కార్యాచరణను రూపొందించిందన్నారు. అందులో భాగంగానే ఆరు గ్యారెంటీల్లో రెండు గ్యారెంటీలను ఇప్పటికే జిల్లాలో అమలు చేస్తున్నామన్నారు. 75వ గణతంత్ర దినోత్సవ వేడుకలను కామారెడ్డి కలెక్టరేట్ ప్రాంగణంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ జితేష్ వి.పాటిల్ జాతీయ పతకాన్ని ఆవిష్కరించారు. అనంతరం అధికారులను, ఉద్యోగులను, ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. ఎందరో త్యాగధనుల పోరాట ఫలితంగా 1947 ఆగస్టు 15న బ్రిటీషు పాలన నుంచి విముక్తైన భారతదేశం స్వతంత్ర దేశంగా ఏర్పడిందన్నారు. కానీ భారతదేశ పౌరుని ఒక ప్రజాస్వామ్య వ్యవస్థలో నడిపించడానికి స్వతంత్ర పోరాట ఆశయాలను నెరవేర్చడానికి భారత ప్రభుత్వానికి రాజ్యాంగం లేనందున 1935 భారత ప్రభుత్వ చట్టం ఆధారంగా పాలన కొనసాగిందన్నారు. దేశరాజ్యాంగాన్ని రూపొందించుటకు 1947 ఆగస్టు 28న రాజ్యాంగ నిర్మాణ కమిటీ ఏర్పాటు చేయడమైందన్నారు. ఈ కమిటీ అధ్యక్షుడిగా బాబాసాహెబ్ అంబేద్కర్ బాధ్యతలు చేపట్టారన్నారు. దాదాపు 2 సంవత్సరాల పాటు 308 మంది సభ్యులు విపులంగా చర్చించి, సవరణలు చేసి భారత రాజ్యాంగాన్ని తయారు చేశారన్నారు. దానిని ఇంగ్లీష్, హిందీ భాషల్లో చేతిరాతతో రాసి అతిపెద్ద ప్రజాస్వామ్య రాజ్యాంగాన్ని రూపొందించారన్నారు. భారత స్వతంత్ర పోరాటానికి బాధ్యత వహించిన ఆనాటి నాయకులు 1930లో పూర్ణ స్వరాజ్యం కోసం ప్రకటన చేసిన జనవరి 26ను పూర్ణ స్వరాజ్య జయంతి దినోత్సవం జరుపుకోవాలని జాతికి పిలుపునిచ్చింది. ఈ తేదికి ఉన్న ప్రాముఖ్యత దృష్ట్యా ఆనాటి నుంచి భారత రాజ్యాంగం అమలులోకి తీసుకురావాలని నిర్ణయించింది. ఆనాటి నుంచి జనవరి 26 1950 నుంచి బ్రిటీష్ కాలం నాటి భారత ప్రభుత్వ చట్టం 1935 రద్దయిందన్నారు. భారతదేశం సర్వసత్తాక, సౌమ్యవాద, లౌకిక, ప్రజాస్వామ్య, గణతంత్ర రాజ్యాంగంగా అవతరించిందన్నారు. ప్రజలందరికీ ప్రాథమిక హక్కులు కల్పించడం జరిగిందన్నారు. అలాగే ప్రతీ పౌరుడు దేశసేవకు, దేశ అభివృద్ధికి పాటుపడేలా బాధ్యతలను కల్పించడం జరిగిందని వీటన్నింటికీ గుర్తుగా రాజ్యాంగం అమలులోకి వచ్చిన రోజు గణతంత్ర దినోత్సవంగా జరుపుకోవడం జరుగుతుందన్నారు.

విజయవంతంగా మహాలక్ష్మి పథకం అమలు

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను చేపడుతుందన్నారు. ఇందులోని మహాలక్ష్మి పథకాన్ని కామారెడ్డి జిల్లాలో విజయవంతంగా అమలు చేస్తున్నామన్నారు. ఈ పథకం ద్వారా జిల్లాలో 27.75 లక్షల మంది మహిళలకు ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణం లబ్ధి చేకూరుతుందన్నారు. ప్రజాపాలన కార్యక్రమం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో గ్రామ స్థాయిలో, పట్టణ ప్రాంతాల్లో వార్డుస్థాయిలో సదస్సులు నిర్వహించి ప్రజల సమస్యలను నేరుగా విని సమస్యలు పరిష్కరించేందుకు కార్యక్రమం చేపట్టడం జరిగిందన్నారు. జిల్లాలో డిసెంబరు 28 నుంచి జనవరి 6 వరకు 526 గ్రామ పంచాయతీలలో 80 మున్సిపాలిటీలలోని వార్డులలో సదస్సులు నిర్వహించి ప్రజల నుంచి ఆరు గ్యారెంటీల పథకాల కోసం దరఖాస్తులు స్వీకరించడం జరిగిందన్నారు. ఇందుకై 2,94,799 దరఖాస్తులు వచ్చాయన్నారు. ఇతర సమస్యలకై 13వేల 367 దరఖాస్తులు స్వీకరించడం జరిగిందన్నారు. వీటిని కంప్యూటరీకరణ పూర్తి చేశామన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు.

ప్రజావాణి సమస్యల పరిష్కారానికి కృషి

జిల్లాలోని కామారెడ్డి కలెక్టరేట్లో ప్రతీ సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఈ ప్రజావాణి కార్యక్రమాల్లో జిల్లా నలుమూలాల నుంచి సమస్యలు విన్నవించుకునేందుకు ప్రజలు వస్తున్నారన్నారు. ప్రజలు వారి వారి సమస్యలను విన్నవిస్తూ వాటిని ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామన్నారు. ప్రజావాణి కార్యక్రమంలోనే వచ్చే ఫిర్యాదులను తక్షణమే ఆయా శాఖల జిల్లా అధికారులకు సూచిస్తున్నామన్నారు. హైదరాబాద్లోని మహాత్మాజ్యోతిబా పూలే ప్రజా భవనంలో ప్రతీ మంగళ, శుక్రవారాల్లో ప్రజా సమస్యలు వినేందుకు మంత్రులు అందుబాటులో ఉంటున్నారన్నారు. అదే విధంగా జిల్లాలోనూ ప్రజావాణిలో ప్రజా సమస్యలు వినేందుకు జిల్లా అధికారులు అందుబాటులో ఉంటున్నారన్నారు.

రూ.2లక్షల రుణమాఫీ కోసం బ్యాంకులతో సంప్రదింపులు



జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ జితేష్ వి.పాటిల్

జిల్లాలోని రైతులకు రూ.2లక్షల రుణమాఫీ కోసం సంబంధించిన బ్యాంకులతో సంప్రదింపులు జరుపుతున్నామన్నారు. ఒక పద్ధతి ప్రకారం ఈ ప్రక్రియ పూర్తి చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందన్నారు. అదేవిధంగా వ్యవసాయానికి నాణ్యమైన ఉచిత విద్యుత్తో పాటు పంటల పెట్టుబడి కోసం ఆర్థిక సహాయం అందించడం జరుగుతుందన్నారు. ప్రభుత్వం యువతకు ఉపాధి, ఉద్యోగాల కల్పన, నైపుణ్యాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టిందన్నారు. ప్రజా ఉద్యమ ఆకాంక్షలు, సంక్షేమం ప్రభుత్వం ప్రాధాన్యం అన్నారు. ప్రతీ అర్హుడికి సంక్షేమ ఫలాలు అందించడం జరుగుతుందన్నారు. గత సంవత్సరం జరిగిన శాసనసభ ఎన్నికలు ప్రశాంతంగా జరగడానికి సహకరించిన ప్రతీ ఒక్కరికి కలెక్టర్ ధన్యవాదాలు తెలిపారు. ప్రజలు అందరూ తమ హక్కులను ఉపయోగించుకుంటూ బాధ్యతలను విస్మరించకుండా దేశసేవకు అభివృద్ధికి పాటుపడాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీ బీబీ పాటిల్, జడ్పీ చైర్పర్సన్ దఫేదార్ శోభ, కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణారెడ్డి, ఎస్పీ సింధూ శర్మ, అదనపు కలెక్టర్ చంద్రమోహన్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మనుచౌదరి తదితరులు పాల్గొన్నారు.

కామారెడ్డి కళాభారతిలో నృత్యాలు చేస్తున్న విద్యార్థినులు





విద్యార్థి దశ నుంచే దేశభక్తిని పెంపొందించుకోవాలి

కామారెడ్డి టౌన్, జనవరి 26: విద్యార్థి దశ నుంచి దేశభక్తిని పెంపొందించుకోవాలని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ అన్నారు. 75వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా కామారెడ్డి పట్టణంలోని కళాభారతీలో జిల్లా సమాచార పౌర సంబంధాలశాఖ, విద్యాశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలకు కలెక్టర్ జితేష్ వి.పాటిల్ ముఖ్యఅతిథిగా హాజరై జ్యోతిని వెలిగించి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందని తెలిపారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడలు, సాంస్కృతిక రంగాల్లో రాణించే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ చంద్రమోహన్, ఆర్డీవో శ్రీనివాస్రెడ్డి, సీపీవో రాజారాం, డీఈవో రాజు, జిల్లా భూగర్భజలాల అభివృద్ధి అధికారి సతీష్కుమార్, జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి శ్రీనివాస్ రెడ్డి, మత్స్యశాఖ అధికారి వరదారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గడికోటలో 'మన సంస్కృతి మేళా'

దోమకొండ: మండల కేంద్రంలోని గడికోటలో శుక్రవారం 'మన సంస్కృతి మేళా' కార్యక్రమం నిర్వహించారు. కోటలో వివిధ ప్రాంతాల నుంచి వివిధ రకాల స్టాళ్లను ఏర్పాటు చేశారు. ముందుగా కోటలో గణతంత్రం దినోత్సవం సందర్భంగా కామినేని అనిల్ కుమార్ ఆధ్వర్యంలో జెండాను ఆవిష్కరించారు. అనంతరం చిన్నారులు చేసిన నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

పార్లమెంట్ ఎన్నికల తర్వాతే పంచాయతీ ఎన్నికలు?

- ఈ నెల చివరితో ముగియనున్న జీపీ పాలకవర్గాల పదవీకాలం
- గ్రామ పంచాయతీలకు స్పెషల్ అధికారుల నియామనికి ఏర్పాట్లు

భిక్కనూరు, జనవరి 26: గ్రామ సర్పంచ్ల పదవీ కాలం ఈ నెల చివరికి ముగియనున్న నేపథ్యంలో స్థానిక సంస్థల ఎన్నికలకు ఇప్పటి వరకు రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. ప్రస్తుతం రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ ఎన్నికలపై దృష్టి సారించింది. ఈ నేపథ్యంలో పార్లమెంట్ ఎన్నికల తర్వాతనే రాష్ట్ర ప్రభుత్వం సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలను నిర్వహించనున్నట్లు స్పష్టమవుతోంది. అదే నిజమైతే స్థానిక సంస్థల ఎన్నికలు ఆలస్యం కానున్నాయి. స్థానిక సంస్థల ఎన్నికలు ఆలస్యం కానునండడంతో గ్రామ పంచాయతీలకు ప్రత్యేక అధికారుల పాలన తప్పనిసరి కానుంది. రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాగానే సర్పంచ్ల పదవీ కాలం ముగిసిన వెంటనే వారి స్థానాల్లో ప్రత్యేక అధికారులను నియమించనున్నారు. అందుకు జిల్లా అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు.

ఈ నెల చివరన ముగియనున్న సర్పంచ్ల పదవీకాలం

సర్పంచ్ల పదవీకాలం ఈ నెల చివరన ముగియనుంది. నూతన పంచాయతీరాజ్ చట్టం ప్రకారం సర్పంచ్ల పదవీకాలం ముగియగానే నిర్దేశిత గడువులోపు ఎన్నికలు నిర్వహించాలి. లేదంటే స్పెషల్ ఆఫీసర్లను ఇన్చార్జీలుగా నియమించి పల్లెపాలనను కొనసాగించాల్సి ఉంటుంది. ప్రస్తుతం సర్పంచ్లు తమ పదవీకాలం ముగియగానే తమనే గ్రామ పంచాయతీలకు పర్సన్ ఇన్చార్జీలుగా కొనసాగించాలని ప్రభుత్వాన్ని వేడుకుంటున్న, సర్పంచ్ల పదవీకాలం ముగియగానే ఆయా పాలకవర్గాలను పర్సన్ ఇన్చార్జీలుగా కొనసాగించేందుకు నూతన పంచాయతీ చట్టం అనుమతించడం లేదు. ఒకవేళ వారిని నియమించాలంటే అసెంబ్లీలో చట్ట సవరణ చేయాలి లేదంటే ప్రత్యేక ఆర్డినెన్స్ తీసుకురావాల్సి ఉంటుంది. కానీ రాష్ట్ర ప్రభుత్వం మాత్రం ప్రత్యేక అధికారుల పాలనకే మొగ్గు చూపుతున్నట్లు సమాచారం.

మండలస్థాయి అధికారులే ఇన్చార్జీలు?

సర్పంచ్ల పదవీకాలం ముగిసిన వెంటనే వారి స్థానాల్లో ప్రభుత్వం మండల స్థాయి అధికారులను ఇన్చార్జీలుగా నియమించనున్నారు. పార్లమెంట్ ఎన్నికల గడువు సమీపిస్తున్న నేపథ్యంలో ఎన్నికల నిర్వహణలో భాగస్వామ్యం లేని శాఖలకు చెందిన అధికారులను ప్రత్యేక అధికారులుగా నియమించాలనే ఆలోచనలో ప్రభుత్వం ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. ముఖ్యంగా మేజర్ గ్రామ పంచాయతీలకు జిల్లా, డివిజన్ స్థాయి అధికారులు, చిన్న గ్రామ పంచాయతీలకు మండల పరిషత్ సూపరింటెండెంట్లు, ఎంపీవోలు, వ్యవసాయ శాఖ అధికారులు, పశు వైద్యాధికారులు, ఏఈలను నియమించే అవకాశం ఉంది. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ఇప్పటికే ఎంపీడీవోలు మండల స్థాయిలో అధికారుల వివరాలను సేకరించి జిల్లా అధికారులకు నివేదించినట్లు సమాచారం.

జిల్లాలో 526 రెవెన్యూ గ్రామాలు.. 6,72,953 మంది ఓటర్లు

2016 అక్టోబరు 11న కొత్త జిల్లాగా అవతరించిన కామారెడ్డి జిల్లాలో పాలన సౌలభ్యం కోసం మండలాల సంఖ్యను అప్పటి ప్రభుత్వం పెంచింది. ప్రస్తుతం కామారెడ్డి జిల్లాలో మూడు రెవెన్యూ డివిజన్లు, 24 మండలాలు, 526 రెవెన్యూ గ్రామాలు ఉన్నాయి. జిల్లాలో సుమారు 2011 జనాభా లెక్కల ప్రకారం 9,72,625 మంది ఉన్నట్లు అంచనా. ఇందులో గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో గత నవంబరు నెలలో జిల్లా అధికారులు ప్రకటించిన లెక్కల ప్రకారం జిల్లాలో 6,72,953 మంది ఓటర్లు ఉన్నట్లు తేలింది. వీరిలో 3,45,915 మంది మహిళ ఓటర్లు కాగా 3,27,001 మంది పురుష ఓటర్లు, 37 మంది ఇతరులు ఉన్నారు.

30న సర్పంచ్ల సన్మానానికి ఏర్పాట్లు

ఫిబ్రవరి 2న సర్పంచ్ల పదవీకాలం ముగియనున్న సందర్భంగా భిక్కనూరు మండలంతో పాటుగా జిల్లాలోని ఆయా మండలాల్లో ఈ నెల 30న సర్పంచ్లకు సన్మాన కార్యక్రమాలు చేపట్టడానికి ఎంపీపీలు, మండల అధికారులు చర్యలు తీసుకుంటు న్నారు. ఇందుకు సర్పంచ్లకు ఎప్పుడు గుర్తుండేలా మండల స్థాయిలో సర్పంచులకు సన్మాన కార్యక్రమాలు చేయనున్నారు.

రావాల్సిన బిల్లులు ఎలా?

గ్రామాభివృద్ధికి అప్పు చేసి డబ్బులు ఖర్చు చేశారు. కానీ చాలా రోజులుగా సర్పంచ్లు ఖర్చు చేసిన పనులకు ఇప్పటికీ బిల్లులు రాక సర్పంచ్లు ఆర్థికంగా చాలా ఇబ్బందులు పడుతున్నారు

ఎల్ఆర్ఎస్కు మోక్షమెప్పుడో?

- ఎల్ఆర్ఎస్ మోక్షానికి దరఖాస్తుదారుల ఎదురుచూపు
- దరఖాస్తుల పరిశీలన పూర్తి కాకుండానే నిలిచిన ప్రక్రియ
- జిల్లాలో 35 వేలకు పైగా దరఖాస్తులు
- ఏళ్లుగా ఎదురు చూపుల్లో ప్లాట్ల యజమానులు
- ప్రక్రియకు అనుమతిస్తే ప్రభుత్వానికి ఆదాయం

కామారెడ్డి టౌన్, జనవరి 26: ఎల్ఆర్ఎస్(లే ఔట్ రెగ్యులరైజేషన్ స్కీం) కోసం దరఖాస్తు చేసుకున్న స్థల యజమానులకు ఎదురు చూపులు తప్పడం లేదు. అధికారులు దరఖాస్తుల పరిశీలనతోనే ప్రక్రియ ఆగిపోయింది. ఎల్ఆర్ఎస్ డబ్బులు చెల్లించిన ప్లాట్ల యజమానులు ఇంకెన్నాళ్లకు మోక్షం వస్తుందని కళ్లుకాయలు కాసేలా ఎదురు చూస్తున్నారు. 2020లో అప్పటి ప్రభుత్వం అక్రమ లే ఔట్ల క్రమబద్ధీకరణ కోసం ఎల్ఆర్ఎస్ పథకాన్ని తీసుకువచ్చింది. ఈ స్కీమ్ ద్వారా జిల్లాలోని కామారెడ్డి, ఎల్లారెడ్డి, బాన్సువాడ మున్సిపాలిటీలతో పాటు మేజర్ గ్రామ పంచాయతీల్లో ఉన్న వెంచర్లలోని ప్లాట్ల క్రమబద్ధీకరణకు 35వేలకు పైగా దరఖాస్తులు అందాయి. దరఖాస్తుల స్వీకరణ అనంతరం బృందాలుగా ఏర్పడిన అధికారులు కొన్నింటిని క్షేత్రస్థాయిలో పరిశీలించిన మధ్యలోనే ఈ స్కీంకు బ్రేక్ పడడంతో ఎల్ఆర్ఎస్ లేకుండా కొన్న ప్లాట్ల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రస్తుత ప్రభుత్వమైన ఎల్ఆర్ఎస్ ప్రక్రియ కొనసాగిస్తే ప్రభుత్వానికి సైతం ఆదాయం వచ్చే అవకాశాలు లేకపోలేదు.

2020లో విడుదలైన జీవో

లేఔట్ ఆమోదం లేని వెంచర్లలో కొనుగోలు చేసిన ప్లాట్లను రెగ్యులరైజ్ చేయడం కోసం ప్రభుత్వం ఎల్ఆర్ఎస్ స్కీమ్ను ప్రవేశపెట్టింది. అంతకుముందు ఆయా వెంచర్లలో లేఔట్లు లేని ప్లాట్ల రిజిస్ట్రేషన్ను ఆయా శాఖల అధికారులు చేయలేదు. తాము వెంచర్ల నిర్వాహకుల చేతిలో మోసపోయామని అనుకుంటున్న ప్రజలకు అప్పటి ప్రభుత్వం రెగ్యులరైజేషన్కు అవకాశం కల్పించడంతో కొనుగోలుదారులు ఊపిరి పీల్చుకున్నారు. అయితే 2020కి ముందు కూడా పలుమార్లు దరఖాస్తులు ఆహ్వానించిన ప్రభుత్వం నుంచి మార్గదర్శకాలు లేకపోవడంతో క్రమబద్ధీకరణ అంశం ముందుకు సాగలేదు. 2020లో మాత్రం జీవో 131ని మున్సిపల్ శాఖ విడుదల చేసింది. ఆ ఏడాది ఆగస్టు 26కు ముందే స్థలాలను రిజిస్ట్రేషన్ చేసుకుని ఉండాలని ప్రభుత్వం మార్గదర్శకాల్లో పేర్కొని ప్రతీ దరఖాస్తుదారుడు రూ.1000 చొప్పున రుసుమును వసూలు చేసింది. కామారెడ్డి మున్సిపల్ పరిధిలో 17,395 దరఖాస్తులు రాగా ఇందులో 4500 దరఖాస్తుల వరకు పరిశీలన చేసినట్లు అధికారులు పేర్కొంటున్నారు.

పరిశీలనతోనే సరి

ఎల్ఆర్ఎస్కు దరఖాస్తుల స్వీకరణ అనంతరం పరిశీలన ప్రారంభించారు. టౌన్ ప్లానింగ్ అధికారులు దరఖాస్తుల ఆధారంగా క్షేత్రస్థాయిలో కొన్ని ప్లాట్లను పరిశీలించారు. అయితే అన్నింటిని పరిశీలించాక అర్హత కలిగిన దరఖాస్తులను ఆన్లైన్లో నమోదు చేసి రెగ్యులరైజేషన్కు అనుమతించినట్లుగా యజమానులకు సమాచారం ఇవ్వాలి. ఆపై స్థలం మార్కెట్ విలువలో 14 శాతం ప్రభుత్వానికి చెల్లిస్తే రెగ్యులరైజ్ చేయాలి. కొన్ని దరఖాస్తులను ఆన్లైన్లో నమోదు చేసిన యజమానులకు సమాచారం ఇవ్వకపోవడంతో ఏం జరిగిందో తెలియక అయోమయం నెలకొంది. కొద్దిమేర పరిశీలన చేసిన వాటిలో వెంచర్లో హైటెన్షన్ టవర్లు ఉన్నాయా, బఫర్జోన్ పరిధిలోకి వస్తుందా, జాతీయ రహదారులు వెళ్లనున్నాయా, ఎక్కడైన ప్రభుత్వ భూమి ఉందా అనే వివరాలను పరిశీలించగా తక్కువ సంఖ్యలో దరఖాస్తుల పరిశీలన తర్వాత ప్రక్రియకు బ్రేక్ పడింది. సుప్రీంకోర్టు ఎల్ఆర్ఎస్కు సంబంధించి పలు ఆంక్షలు విధించడంతో ప్రస్తుతం గతంలో స్వీకరించిన దరఖాస్తులలో ఎలాంటి ఇబ్బందులు లేకుంటే వాటిని పరిశీలించి అనుమతులను అధికారులు మంజూరు చేస్తున్నారు. నూతనంగా దరఖాస్తులను మాత్రం స్వీకరించకపోవడంతో మిగిలిన వారు ఎల్ఆర్ఎస్కు అవకాశం కల్పించాలని కోరుతున్నారు.

ప్రభుత్వానికి ఆదాయం

వెంచర్లలో స్థలాలు కొనుగోలు చేసి ఇంటి నిర్మాణానికి అనుమతులు రాక స్థలంపై రుణాలు తీసుకునే అవకాశం లేని వారికి ఎల్ఆర్ఎస్తో ఊరట లభించనుంది. అయితే దరఖాస్తులకు అనుమతించే ప్రక్రియ చేపట్టకపోవడంతో యజమానులకు ఎదురుచూపులు మిగలగా ఇంకో పక్క ప్రభుత్వానికి వచ్చే ఆదాయం సైతం నిలిచిపోయింది. జిల్లాలోని పలువురు అనుమతులు లేకుండానే లేఔట్లు చేసి వెంచర్లు ఏర్పాటు చేయగా విషయం తెలియని వారు స్థలాలు కొనుగోలు చేసుకుని ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. ఇకనైన ప్రభుత్వం ఎల్ఆర్ఎస్కు అనుమతులు ఇస్తే ఫీజు చెల్లించి రెగ్యులర్ చేయించుకుని ఇళ్లు నిర్మించుకోవాలని ప్రజలు భావిస్తున్నారు.

ఐదుగురు అంతర్ జిల్లా దొంగల అరెస్టు



గంభీరావుపేట పోలీస్ స్టేషన్‌లో ఐదుగురు అంతర్ జిల్లా దొంగల ముఠాను అరెస్ట్ చూపిస్తున్న సీఐ శశిధర్‌రెడ్డి

గంభీరావుపేట, జనవరి 26 : వరుస దొంగతానాలకు పాల్పడుతున్న ఐదుగురు అంతర్ జిల్లా దొంగల ముఠాను అరెస్ట్ చేశామని, వారి నుంచి రూ. 40 వేల నగదుతోపాటు రెండు సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నామని సీఐ శశిధర్‌రెడ్డి తెలిపారు. గంభీరావుపేట పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. నిందితులైన కామారెడ్డి జిల్లా నారాయణపూర్‌కు చెందిన పూడెం అరుణ్‌కుమార్, ఆర్మూర్‌కు చెందిన బోడమీది రవి, గాంధారికి చెందిన గాయిని మైసయ్య, గులును లింగం, కామారెడ్డికి చెందిన కలీం అహ్మద్‌ను పెద్దమ్మ స్టేజీ వద్ద పట్టుకున్నట్లు సీఐ తెలిపారు. నిందితులు మండల పరిధిలోని ముస్తాఫనగర్, దమ్మన్నపేట గ్రామాల్లో ఉన్న ఐడియా, బీఎస్ఎన్ఎల్ సెల్ టవర్‌లలోని బ్యాటరీలను గతేడాది డిసెంబరు 16న దొంగలించారని పేర్కొన్నారు. నారాయణపూర్‌కు చెందిన అరుణ్‌కుమార్ గతంలో బీఎస్ఎన్ఎల్ కంపెనీలో సూపర్ వైజర్‌గా పనిచేశారన్నారు. అరుణ్‌కుమార్ మిగతా నిందితులను కలుపుకుని ఒక ముఠాగా ఏర్పడి దొంగతనాలకు పాల్పడేవాడని తెలిపారు. దోచుకున్న వస్తువులను కామారెడ్డిలోని కలీం అహ్మద్ అమ్మేవారని వెల్లడించారు.

ఐడియా, బీఎస్ఎన్ఎల్ సిబ్బంది ఫిర్యాదుతో దొంగతనాలకు పాల్పడ్డ వారికి కోసం ఇటీవల గాలింపు మొదలు పెట్టామన్నారు. శుక్రవారం పెద్దమ్మ స్టేజీ వద్ద పట్టుకున్నామని, గాందారికి చెందిన మరో నేరస్తుడు మ్యాతరి సాయిలు పరారీలో ఉన్నాడని చెప్పారు. నిందితులు గతంలో బాన్సువాడ పోలీస్ స్టేషన్ పరిధిలో దొంగతనానికి పాల్పడగా, వారి నుంచి లక్షా 50 వేలు, 72 బ్యాటరీలు, దొంగతనానికి ఉపయోగించిన కారును, టాటా ఏసీ ఆటోను అక్కడి పోలీస్‌లు స్వాధీనం చేసుకున్నారని తెలిపారు. వీరు కామారెడ్డి జిల్లాలో 10 కేసుల్లో నిందితులని, ఇప్పటి వరకు పాల్పడిన దొంగతనాలను ఒప్పుకున్నారని వివరాలను వెల్లడించారు. ఈ సమావేశంలో ఎస్సై రాంమోహన్, సిబ్బంది ఉన్నారు.

పిట్లం మండలంలో

ఘనంగా గణతంత్ర దినోత్సవ వేడుకలు

పిట్లం జనవరి 26 : మండలంలో శుక్రవారం ఘనంగా గ్రామ గ్రామాన వాడవాడలా గణతంత్ర దినోత్సవం సందర్భంగా మువ్వెన్నెల జెండాలను అధికారులు, నాయకులు వెగురవెశారు.పిట్లంలో తహశీల్దార్ కార్యాలయంలో డిప్యూటి తహశీల్దార్ నరేష్, ఎంపిడివో కార్యాలయంలో ఎంపీపీ కవిత, ఎఎమ్‌సి కార్యాలయంలో అద్యక్షురాలు సావిత్రి, పోలీస్‌షేశన్‌లో ఎస్‌ఐ విజయ్, గ్రామ పంచాయితీ కార్యాలయాలలో సర్పంచ్‌లు, ఆయా సంఘాలలో,ప్రభుత్వ కార్యాలయాలలో, ప్రవేటు పాఠశాలలో మువ్వెన్నెల జెండాలను ఎగుర వెశారు.

రాజంపేట : రాజంపేట మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంతో పాటుగా గ్రామాలలో,పలు కులసంఘాల ఆధ్వర్యంలో గణతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. జాతీయ జెండాను ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో ఆయా శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయం పునః ప్రారంభం

మద్నూర్, జనవరి 26 : మండల కేంద్రంలోని ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయం గత యేడాది బిచ్కుందకు తరలించడంతో ఇటీవల భారతీయ జనతాపార్టీ నాయకులు, కార్యకర్తలు ఖాళీగా ఉన్న కార్యాలయంలో బీజేపీ కార్యకర్తలు స్వచ్ఛ భారత్ నిర్వహించారు. జనవరి 26 వరకు కార్యాలయం ప్రారంభించకుంటే జెండా ఎగురవేస్తామని తెలుపడంతో బిచ్కుందలో ఉన్న కార్యాలయాన్ని గురువారం రాత్రి మద్నూర్‌లో తిరిగి ప్రారంభిస్తున్నామని బోర్డు ఏర్పాటుచేసి రాత్రికి రాత్రి ఏర్పాట్లుచేసి జనవరి 26న జెండా ఎగురవేశారు.

మద్నూర్ మండలంలో ఘనంగా గణతంత్ర దినోత్సవం



పోలీస్ స్టేషన్‌లో జెండా ఎగురవేస్తున్న ఎస్సై



దేశ భక్తుల వేషాధారణలో చిన్నారులు

మద్నూర్, జనవరి 26 : 75వ గణతంత్ర దినోత్సవ వేడుకలు శుక్రవారం మండలంలో ఘనంగా జరుపుకున్నారు. ఉదయం 7 గంటల నుంచే ఆయా కార్యాలయాలు, పాఠశాలల వద్ద జాతీయ జెండాను ఎగురవేశారు. మండల కేంద్రంలోని తహసీల్దార్‌కార్యాలయం వద్ద తహసీల్దార్‌ముజీబ్, ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ, ఎఎంసీలో కార్యదర్శి, ఆయా పార్టీల కార్యాలయాల వద్ద అధ్యక్షులు జెండాలను ఎగురవేశారు. ఈ సందర్భంగా ప్రజలకు, అధికారులు గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపి పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు.

ఆకట్టుకున్న చిన్నారుల వేషధారణ

మండలంలోని ఆయా పాఠశాలలో చిన్నారుల వేషాధారణలు ఆకట్టుకున్నాయి. జాతీయ నాయకుల వేషాదారణలతో పాటు శ్రీ రాముని వేషాధారణలు రామరాజ్యం వచ్చిందంటూగుర్తు చేశారు. ప్రభాత్‌భేరీలో కోలాటాలు ఆడి చిన్నారులు ఆకట్టుకున్నారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి.

డిగ్రీ కళాశాలలో ఎగురని జెండా

మద్నూర్, జనవరి 26 : గణతంత్ర దినోత్సవం రోజున విద్యార్థులతో కళకళలాడాల్సిన కళాశాల వెలవెలబోయింది. గత యేడాది మద్నూర్ కళాశాల ప్రారంభం కాగా ఇప్పటివరకు జెండా పండుగ డిగ్రీ కళాశాలలో జరుపుకోకపోవడంతో పలువురు ఆగ్రహం వ్యక్తం చేశారు.



రామ పరివార వేషధారణలో చిన్నారులు




కోలాటం వేస్తున్న చిన్నారులు













అనాథలమనే భావన వీడి చక్కగా చదువుకోవాలి

● కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు



పిల్లలకు పండ్లు పంపిణీ చేస్తున్న కలెక్టర్



విద్యార్థులను అభినందిస్తున్న కలెక్టర్, డీఈవో

నిజామాబాద్ అర్బన్, జనవరి 26: అనాథలమనే భావన వీడి చక్కగా చదువుకోవాలని పిల్లలకు సూచించారు. తమకు ఎవరూ లేరని, తాము ఒంటరివారిమనే ఆలోచనను దగ్గరకు రానివ్వద్దని నచ్చజెప్పారు. గణతంత్ర దినోత్సవ వేడుకల్లో భాగంగా శుక్రవారం జిల్లా కేంద్రంలోని సుభాష్‌నగర్ బాలసదన్‌లో కలెక్టర్ చిన్నారులకు పండ్లు పంపిణీ చేశారు. సీపీ కల్మేశ్వర్, అదనపు కలెక్టర్ యాదిరెడ్డి, ట్రైనీ ఐపీఎస్ చైతన్య, తదితరులు హాజరైన విద్యార్థులకు పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు. చిన్నారులకు రిపబ్లిక్‌డే శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం అందించే తోడ్పాటును పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకొని జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. జిల్లా యంత్రాంగం అండగా ఉంటుందని కలెక్టర్ భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో డీసీపీ జయరాం, డీడబ్ల్యువో రసూల్‌బీ, కలెక్టరేట్ ఏవో ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.

● కేజీబీవీ విద్యార్థులను అభినందించిన కలెక్టర్, డీఈవో

డిచ్‌పల్లి: డిచ్‌పల్లి మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యార్థినులు రిపబ్లిక్ డే సందర్భంగా జిల్లా కలెక్టరేట్‌లో ప్రదర్శించిన నృత్య ప్రదర్శనలు ఎంతో ఆకట్టుకోవడంతోపాటు జిల్లాస్థాయిలో రెండో బహుమతి సాధించిన విద్యార్థులను కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు, అదనపు కలెక్టర్ యాదిరెడ్డి, జిల్లా విద్యాశాఖ అధికారి దుర్గాప్రసాద్ అభినందించారు. కృషి పట్టుదల ఉంటే ఏదైనా సాధ్యమని విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించడం అభినందనీయమన్నారు.

● జాతీయ స్థాయిక్రీడల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు అభినందన

ధర్మారం(బి) గురుకుల పాఠశాలకు చెందిన 16 మంది విద్యార్థులను జాతీయస్థాయి పోటీల్లో రాణించి పాఠశాలకు మంచి పేరు తెచ్చినందుకు ప్రిన్సిపాల్ సంగీతతో కలిసి ఆర్సీవో అలివేలు 16మంది క్రీడాకారులను ఘనతంత్ర్య వేడుకల సందర్భంగా సన్మానించి అభినందించారు. కార్యక్రమంలో పీటీ నీ రాజరెడ్డి, పీఈటీ జ్యోత్స్న, పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు. రిపబ్లిక్ డే సందర్భంగా మిట్టపల్లి పభుత్వ పాఠశాలలో మాజీ ఎంపీపీ కంచెట్టి గంగాధర్‌ను పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామ ప్రజాప్రతినిధులు ఘనంగా సన్మానించారు.



పంటను పరిశీలిస్తున్న ఏవో

దోమకొండలో వరి పంట పరిశీలన

దోమకొండ, జనవరి 26: దోమకొండ శివారులోని వరిపంటలను శుక్రవారం ఏవో పవన్ కుమార్ పరిశీలించారు. ప్రస్తుత పరిస్థితుల్లో వరి పంట ఏపుగా పెరగడం లేదని రైతులు ఏవో దృష్టికి తీసుకెళ్లారు. మందులు పిచికారీ చేసిన వరిపంటలో మార్పు రావడం లేదని తేగుళ్ల, దోమపోటు వస్తుందని రైతులు ఏవోకు వివరించారు. పంటలను పరిశీలించి అనంతరం ఏవో మాట్లాడుతూ వాతవరణం అనుకూలత, పంటల మార్పిడీ చేయడం నేల అరబెట్టడం వలన పంటల దిగుబడి పొందవచ్చని సూచించారు. వరి పంటలకు ప్రస్తుత సమయంలో వ్యవసాయాధికారుల సూచనలు పాటించాలన్నారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

ఎండు గంజాయి విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

సుభాష్‌నగర్, జనవరి 26: ఎండు గంజాయిని విక్రయిస్తున్న షేక్ అజామ్‌ను అరెస్టుచేసి అతని వద్ద నుంచి ఒక కిలో 315 గ్రాముల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు నిజామాబాద్ ఎక్సైజ్ ఎస్‌హెచ్‌వో దిలీప్ శుక్రవారం తెలిపారు. నగరంలోని ఆర్‌ఆర్ చౌరస్తాలోగల అటవీ శాఖ కార్యాలయం పక్కనగల ఖాళీస్థలంలో ఎండు గంజాయిని అమ్ముతుండగా షేక్‌అజామ్‌ను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నట్లు చెప్పారు. షేక్ అజామ్‌ను అరెస్టుచేసి రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు. దాడుల్లో ఎస్సై మల్లేష్, సిబ్బంది షబ్బీర్, భాస్కర్, తంగయ్య, రవి, సంజయ్ పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మీ చెక్కుల పంపిణీ

రాజంపేట, జనవరి 26: రాజంపేట మండంలోని పలు గ్రామాలకు చెందిన 23 కల్యాణలక్ష్మీ చెక్కులను శుక్రవారం ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు పంపిణీ చేశారు. ఆర్గొండ, బస్వన్నపల్లి, గుండారం, కొండాపూర్, ఎల్లారెడ్డిపల్లి తండా, ఎల్లాపూర్‌తండా, అన్నారం, శేర్‌శంకర్ తండా గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మీ చెక్కులను పంపినట్లు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ అనిల్‌కుమార్, సర్పంచ్‌లు, సీనియర్ నాయకులు సంజీవ్‌రెడ్డి, సెర్‌లాల్, రాజు, రమేష్ పాల్గొన్నారు.

రాష్ట్రాస్థాయి గణిత ప్రతిభా పరీక్షకు ముచ్కూర్ పాఠశాల విద్యార్థిని ఎంపిక



విద్యార్థిని శ్రావ్యను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

భీమ్‌గల్ రూరల్, జనవరి 26: రాష్ట్రస్థాయి గణితా ప్రతిభా పరీక్షకు భీంగల్ మండలంలోని ముచ్కూర్ ప్రభుత్వ పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థిని కొడిగెల శ్రావ్య ఎంపికైంది. ఈ సందర్భంగా శుక్రవారం రిపబ్లిక్ డే రోజున సర్పంచ్ బండిజ్యోతి, ఉపసర్పంచ్ ఒజ్జుం భూమేష్, ఉపాధ్యాయ బృందం విద్యార్థిని ఘనంగా సన్మానించారు.

జీపీ భవనాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే



గ్రామ పంచాయతీ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు

నాగిరెడ్డిపేట, జనవరి26: నాగిరెడ్డిపేట మండలకేంద్రంలోని గోపాల్‌పేట్ గ్రామ పంచాయతీ నూతన భవనాన్ని శుక్రవారం ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మధన్‌మోహన్‌రావు ప్రారంబోత్సవం చేశారు. గోపాల్‌పేట్ గ్రామ పంచాయతీకి సొంత భవనం లేకపోవడంతో, ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా రూ.20 లక్షలను నూతన గ్రామ పంచాయతీ భవనం కోసం మంజూరు చేశారు. ఇటీవలే గ్రామ పంచాయతీ భవన నిర్మాణం పనులన్నీ పూర్తి కావడంతో ఎమ్మెల్యే జీపీ కార్యాలయ భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ వంజరి సునీత ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. అనంతరం గోపాల్‌పేట్ గ్రామంలోని రెండో వార్డులో మండల పరిషత్ నిధుల ద్వారా 2లక్షల 20వేల రూపాయలతో నిర్మించనున్న సీసీ రోడ్డు నిర్మాణం పనులను ఎమ్మెల్యే ప్రారంభించారు. మండల పరిషత్ కార్యాలయానికి విచ్చేసిన ఎమ్మెల్యేకు స్థానిక ఎంపీపీ రాజ్‌దాస్ సన్మానించారు. ఈ సందర్భంగా మండల పరిషత్ కార్యాలయం పూర్తిగా శిథిలావస్థకు చేరి కూలిపోయే స్థితిలో ఉన్నందున మండల పరిషత్ నూతన కార్యాలయ భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని ఎంపీపీ రాజ్‌దాస్ ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు కోరారు. కార్యక్రమంలో జడ్పీటీసీ మనోహర్‌రెడ్డి, ఎంపీపీ రాజ్‌దాస్, మండల కో ఆప్షన్ మెంబర్ షాహెద్ పాషా, మండల రైతు నాయకుడు నర్సింహారెడ్డి, స్థానిక సర్పంచ్ వంజరి సునీత కిరణ్, ఉప సర్పంచ్ దుర్గేష్, సొసైటీ అధ్యక్షుడు గంగారెడ్డి, ఎల్లారెడ్డి, ఆర్డీవో ప్రభాకర్, తహసీల్దార్ లక్ష్మణ్, ఎంపీడీవో రఘు, ఎంపీవో శ్రీనివాస్, పంచాయతీ రాజ్ ఏఈ పిచ్చయ్య, మండల సర్పంచ్‌లు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గేదె మృతి

ఎడపల్లి జనవరి 26: ఎడపల్లి మండల కేంద్రంలో శుక్రవారం ఉదయం గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో గేదె మృతి చెందింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకార ం.. మండల కేంద్రానికి చెందిన కంజర్ ఓం ప్రకాష్ అనే పాడి రైతుకు చెందిన గేదె ఉదయం గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో రోడ్డుపై మృతిచెందింది. పాడినే నమ్ముకుని జీవనం సాగిస్తున్న పాడి రైతుకు చెందిన గేదె మృతిచెందడంతో రైతుకు దాదాపు 25వేల రూపాయల నష్టం వాటిల్లిందని స్థానికులు తెలిపారు.



మృతిచెందిన గేదె



హెల్మెట్‌పై నాటిక ప్రదర్శిస్తున్న విద్యార్థులు

హెల్మెట్ ఉపయోగంపై అవగాహన

భిక్కనూరు, జనవరి 26: భిక్కనూరు మండలకేంద్రంలోని సినిమా టాకీసు చౌరస్తాలో శుక్రవారం భిక్కనూరు శ్రీచైతన్య పాఠశాల విద్యార్థులు హెల్మెట్ ఉపయోగంపై పోలీసుశాఖ సహకారంతో నాటిక ప్రదర్శన ద్వారా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులు హెల్మెట్ వాడకపోవడంతో జరుగుతున్న నష్టాలు, ధరించడం వలన కలిగే ఉపయోగాలను నాటికలో వివరించారు. అనంతరం భిక్కనూరు ఏఎస్సై జగదీష్ మాట్లాడుతూ ప్రతీ ద్విచక్రవాహనదారులు తప్పకుండా హెల్మెట్ ధరించాలని, రోడ్డుప్రమాదాల్లో ఎక్కువగా హెల్మెట్ ధరించని వారే మృత్యువాత పడుతుతున్నారని వివరించారు. విద్యార్థులను పోలీసులు అభినంధించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ రేణుకుమార్, ప్రిన్సిపాల్ అశోక్‌యాదవ్, సిబ్బంది పాల్గొన్నారు.

బాన్సువాడ మేరు సంఘం కార్యవర్గం ఎన్నిక

బాన్సువాడటౌన్, జనవరి 26: బాన్సువాడ మేరు సంఘం నూతన కార్యవర్గాన్ని శుక్రవారం సంఘ భవనంలో సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా హన్మాండ్లు, ప్రధాన కార్యదర్శిగా వెంకటి, కోశాధికారిగా లింగం, కార్యదర్శులుగా వీరేందర్, సురేష్, సాయినాథ్, మదుసూదన్, సురేష్, సాయిలు, న్యాయ సలహాదారుడిగా కొత్తకొండ భాస్కర్, సలహాదారులుగా దేవదాస్, హన్మాండ్లు, తమ్మన్నలను ఎన్నుకున్నట్లు సంఘ సభ్యులు తెలిపారు.



ఎన్నికైన మేరు సంఘం నూతన కార్యవర్గ సభ్యులు



పురస్కారాన్ని అందజేస్తున్న దృశ్యం

ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు నగదు పురస్కారం

నవీపేట, జనవరి 26: నవీపేట జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో 2022-23 విద్యా సంవత్సరంలో జరిగిన టెన్త్ పరీక్షలలో ఉత్తమ మార్కులు సాధించిన జాన్సన్, వినయ్, భాస్కర్, నాగరాజు అనే విద్యార్థులకు నగదు పురస్కారాన్ని సర్పంచ్ ఏటీఎస్ శ్రీనివాస్ చేతుల మీదుగా అందజేశారు. మండలంలోని కమలాపూర్‌కు చెందిన వేమూరి గాంధీదాస్ జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు రూ.15వేల నగదును అందజేశారు. అలాగే కరీంనగర్ తేజస్ డిఫెన్స్ ఆకాడమీ కరస్పాండెంట్ సీహెచ్ సతీష్ రావు పాఠశాలలో నిర్వహించిన క్రీడ పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేయడానికి 20వేల నగదును అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ ఏటీఎస్ శ్రీనివాస్, పాఠశాల హెచ్ఎం రత్నకుమారి, ఎంపీటీసీలు రాధ, మీనా ఉన్నారు.

'పండిత్ వినీతనే చైర్‌పర్సన్‌గా కొనసాగించాలి'

ఆర్మూర్‌టౌన్, జనవరి 26: ఆర్మూర్ మున్సిపాలిటికీ పండిత్ వినీతనే చైర్‌పర్సన్‌గా కొనసాగించాలని కౌన్సిలర్‌లు డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలోని ప్రెస్‌క్లబ్ భవనంలో వారు మాట్లాడారు. ఈనెల 4న అవిశ్వాసం వీగిందని భావిస్తున్నామని, ఎక్స్‌ఆఫిషియో ఓటువేయకపోవడంపై కలెక్టర్ ఫిర్యాదు చేశామని చెప్పారు. అధికారుల ఆదేశాలు వచ్చేవరకు వినీతను చైర్‌పర్సన్‌గా కొనసాగించాలని కోరారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు బదం రాజ్‌కుమార్, తాటి హన్మండ్లు, మురళిధర్‌రెడ్డి, నాయకులు పండిత్‌పవన్, ప్రేమ్, ఎస్‌ఆర్ రమేష్, తలారి చందు, లింగంపల్లి శివ, రింగుల భూషణ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కౌన్సిలర్‌లు, నాయకులు

యువత క్రీడల పట్ల ఆసక్తి కనబర్చాలి

● ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి



టోర్నమెంట్‌ను ప్రారంభించి షెటిల్ ఆడుతున్న ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి

కమ్మర్‌పల్లి జనవరి26: యువకులు క్రీడల పట్ల ఆసక్తి కనబరుస్తూ జాతీయ, అంతర్జాతీయ స్థాయికి ఎదగాలని బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. కమ్మర్‌పల్లి మండల కేంద్రంలోని కేబీఏ ఇండోర్ స్టేడియంలో రెండు రోజుల పాటు నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి బాల్‌బ్యాట్ మెంటెన్ టోర్నమెంట్ శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతు తనతోపాటు తన కుటుంబ సభ్యులు సైతం క్రీడలపట్ల ఆసక్తి పెంచుకున్న వారమేనన్నారు. గతంలో తాను ఆడిన క్రీడలు, తనతో ఆడిన క్రీడాకారులను ఆయన గుర్తు చేసుకున్నారు. కమ్మర్‌పల్లిలో కమ్మర్‌పల్లి బాల్ బ్యాట్ మెంటెన్ అసోషియోషన్ తమ సొంత డబుల్లతో ఇండోర్ స్టేడియం నిర్మించుకోవడం అభినందనీయమన్నారు. ప్రతీ గ్రామంలోని యువతల ఈ ఉత్సాహం రావాని అప్పుడే గ్రామీణ క్రీడాకారులకు గుర్తింపు వస్తుందన్నారు. ఈ టోర్నమెంట్‌కు రాష్ట్రవ్యాప్తంగా 70 జట్లు పాల్గొనడంతో పాటు మహారాష్ట్ర నుంచి టీములు రావడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా టోర్నుమెంట్‌ను ప్రారంభించి కొద్దిసేపు క్రీడాకారులతో షెటిల్ ఆడారు. కార్యక్రమంలో ఎంపీపీ గౌతమి, తహసీల్దార్ అంజనేయులు, రేగుంట దేవేందర్, సర్పంచ్ గడ్డం స్వామి, ఎంపీటీసీ సుధాకర్, అసోసియేషన్ అధ్యక్షుడు ఎండీ అహ్మద్, లుక్కగంగాధర్, క్రీడాకారులు, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ మహేష్ కుమార్‌ను కలిసిన ఎన్‌సీఎస్ఎఫ్ కార్మికులు

నిజామాబాద్ రూరల్, జనవరి 26: సారంగపూర్‌లోని చక్కెర కర్మాగారంలో పనిచేసిన కార్మికులు ఎమ్మెల్సీ మహేష్‌కుమార్ గౌడ్‌ను కలిసి వినతిపత్రం అందించారు. కార్మికులకు ఆరేళ్లుగా వేతనాలు ఇవ్వడం లేదని, వేతనాలు లేక తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. గత ప్రభుత్వం ఉద్యోగుల జీతాలకు రూ.5 కోట్ల నిధులు విడుదల చేస్తానని హామీ ఇచ్చిందని గుర్తుచేశారు. ప్రభుత్వ పెద్దలతో మాట్లాడి కార్మికుల వేతనాలు విడుదల చేసేలా చూడాలని కోరారు. ఎమ్మెల్సీని కలిసినవారిలో గోవర్ధన్ గౌడ్, రహీం, విజయ్ తదితరులున్నారు.

రూరల్ పీఎస్‌లో కానిస్టేబుల్‌పై కేసు

నిజామాబాద్ రూరల్, జనవరి 26: రూరల్ పోలీసుస్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న మహేష్‌పై ఫోక్సో చట్టం కింద కేసు నమోదు చేసినట్లు ఇన్‌చార్జి ఎస్‌హెచ్‌వో శుక్రవారం తెలిపారు. గతంలో భార్యాభర్తల కేసులో అనుచితంగా ప్రవర్తించాడని ఆయనను సీపీ సస్పెండ్ చేశారు. ఇటీవలే విధుల్లో చేరిన మహేష్ రూరల్ మండలంలోని ఓ గ్రామంలో కేసు విషయమై విచారణకు వెళ్లగా.. అక్కడ కానిస్టేబుల్ తనతో అసభ్యంగా ప్రవర్తించాడని రూరల్ పోలీసులకు ఓ మైనర్ బాలిక ఫిర్యాదుచేసింది. దీంతో పోలీసు ఉన్నతాధికారులు విచారించి ఆయనపై ఫోక్సో చట్టం కింద కేసు నమోదుచేయాలని ఆదేశించినట్లు తెలిసింది.

ముత్యంపేట గౌడ సంఘం కమిటీ ఎన్నిక

దోమకొండ, జనవరి26: మండలంలోని ముత్యంపేట గ్రామంలో శుక్రవారం గౌడ సంఘం నూతన కమిటీని సంఘ సభ్యుల ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ముత్తగారి శిరీష్‌గౌడ్‌ను ఎకగ్రీవంగా ఎన్నుకున్నట్లు గౌడ సంఘం సభ్యులు తెలిపారు. మాజీ అధ్యక్షులు సురేష్‌గౌడ్, అనిల్‌గౌడ్, బాల్ నర్సుగౌడ్, నరేష్‌గౌడ్, నటరాజ్‌గౌడ్, లక్ష్మణ్‌గౌడ్, నీలంగౌడ్, ప్రకాశ్‌గౌడ్, మహేందర్‌గౌడ్, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

ముదిరాజ్ సంఘం నూతన కార్యవర్గం ఏర్పాటు

కామారెడ్డిటౌన్, జనవరి 26: కామారెడ్డి పట్టణ ముదిరాజ్‌సంఘం నూతన కార్యవర్గాన్ని ఏర్పాటుచేశారు. అధ్యక్షుడిగా దాదేబాలరాజ్, ప్రధాన కార్యదర్శిగా భానుప్రకాష్, కోశాధికారిగా రాంచంద్రం, ఉపాధ్యక్షుడిగా శ్రీనివాస్, రమేష్, కార్యవర్గసభ్యులుగా నవీన్, పెద్దనర్సింలు, చిన్నలక్ష్మన్, మనోజ్, రాజు, వినోద్, ఆశయ్యలను ఎన్నుకున్నారు.

ఆదర్శ పాఠశాలలో ఆకట్టుకున్న విద్యార్థుల ప్రదర్శనలు

డిచ్‌పల్లి, జనవరి 26: రిపబ్లిక్‌డే సందర్భంగా డిచ్‌పల్లి ఆదర్శ పాఠశాల విద్యార్థిని, విద్యార్థులు సంస్కృతి కార్యక్రమాలు అలంరించాయి. విజయనగర అస్థానం కవుల పాత్రలను విద్యార్థులు ప్రదర్శించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ గణేశ్ విద్యార్థులను అభినందించారు.

బాధితురాలికి ఫోన్ అందజేత

నసురుల్లాబాద్, జనవరి 26 : కళాశాల విద్యార్థిని పొగొట్టుకున్న ఫోన్‌ను బాధితురాలికి నసురుల్లాబాద్ ఎస్సై లావణ్య శుక్రవారం అందజేశారు. ఆమె తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నసురుల్లాబాద్ మండలం బొమ్మన్‌దేవ్‌పల్లి గ్రామానికి చెందిన ఓల్లెపు రాములు కుమార్తె శిరీష బాన్సువాడలో కళాశాల విద్యార్థిని, ఆమె బస్సులో ప్రయాణిస్తుండగా ఆమె సెల్‌ఫోన్ పోయింది. దీంతో ఆమె తల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారని, ఫిర్యాదు తీసుకుని కేసు నమోదు చేసుకుని, సెల్‌ఫోన్‌ను పట్టుకుని బాధితురాలి తల్లికి అప్పగించినట్లు ఎస్సై లావణ్య వివరించారు. పోయినఫోన్ తిరిగి విచ్చనందుకు బాధితురాలు సంతోషం వ్యక్తంచేసింది. ఎస్సై లావణ్య, పోలీస్ సిబ్బందికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపింది.

మఠాధిపతికి ఘన స్వాగతం

బిచ్కుంద, జనవరి 26: అయోధ్యలో ప్రతిష్ఠించిన బాలరాముడి విగ్రహ ప్రతిష్ఠాపనకు వెళ్లి తిరిగి వచ్చిన సద్గురు బండాయప్ప మఠసంస్థాన్ మఠాధిపతి సోమలింగ శివాచార్యులు శుక్రవారం బిచ్కుందకు చేరుకున్నారు. మఠాధిపతికి అంబేద్కర్ చౌరస్తా వద్ద భారీసంఖ్యలో గ్రామపెద్దలు భక్తులు ప్రజలు సోమలింగ శివాచార్యులను దర్శించుకుని పూలమాలలు వేసి ఆశిస్సులు పొందారు.



స్వాగతం పలుకుతున్న భక్తులు



వృద్ధురాలికి దుప్పటిని అందజేస్తున్న దృశ్యం

వృద్ధులకు దుప్పట్ల పంపిణీ

నవీపేట, జనవరి 26: జన వికాస్ సేవా సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం మండల కేంద్రంలోని బర్కత్‌పుర కాలనీలో పలువురు వృద్ధులకు దుప్పట్లను పంపిణీ చేశారు. గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ఇటీవల విద్యార్థులకు నిర్వహించిన పలు క్రీడాపోటీలలో గెలుపొందిన వారికి సైతం బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జన వికాస్ సేవా సంస్థ జిల్లా అధ్యక్షుడు తెడ్డు పోశెట్టి, ఉపసర్పంచ్ మల్లేష్, సూరిబాబు, మొహిజ్, యుసుఫ్, అమన్ పాల్గొన్నారు.

పుట్టగొడుగుల్లా బెల్ట్‌షాపులు

● ఎడపల్లిలో జోరుగా మద్యం విక్రయాలు ● ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు ● ఉన్నతాధికారులు స్పందించాలంటున్న ప్రజలు

ఎడపల్లి, జనవరి26: ఎడపల్లి మండలంలో బెల్ట్ షాపులు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి. ఆలయాలు, ప్రభుత్వ పాఠశాలల సమీపంలో నిబంధనలకు విరుద్ధంగా మద్యం గొలుసు దుకాణాలు ఏర్పాటు చేయడంపై ప్రజలు మండిపడుతున్నారు. ఒక్కో గ్రామంలో రెండంకెల సంఖ్యలో ఈ మద్యం గొలుసుల దుకాణాల కారణంగా నిత్యం వివాదాలకు నిలయంగా మారాయి. తాగిన మైకంలో కొందరు వీరంగం సృష్టిస్తుండడంతో అనేక ఇబ్బందులు పడుతున్నామని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలో కొంతకాలంగా బెల్ట్‌షాపుల నిర్వాహకుల తీరు ఇష్టారాజ్యంగా మారింది. కాంగ్రెస్ ప్రభుత్వం మద్యం గొలుసు దుకాణాలను నివారిస్తామని చెప్పిందని, వెంటనే అమలు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఎడపల్లి మండలంలోని 17 గ్రామ పంచాయతీలలో రెండు వైన్స్‌షాపులు ఉన్నాయి. ఒకటి ఎడపల్లి మరొకటి జానకంపేటలో కొనసాగుతున్నాయి. వాటి పరిధిలోని గ్రామాల్లో విచ్చలవిడిగా మద్యం గొలుసు దుకాణాలు వెలుగుచూస్తూ అవి కొనసాగుతున్న నిర్వహణ తీరు స్థానిక గ్రామాల ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోంది. మహిళలు పలువురు సైతం పలుమార్లు వీటిపై ఎక్సైజ్, స్థానిక పోలీస్ వివిధ శాఖల అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదనే ఆరోపణలు ఉన్నాయి. దీంతో ఎడపల్లి మండల కేంద్రంలోని ఓ మద్యం గొలుసు దుకాణంలో చోటు చేసుకున్న చిన్నపాటి వివాదం చినికిచినికి గాలివానలా మారింది. చివరికి ఆ మద్యం గొలుసు దుకాణంలో మందు తాగి తాగిన మైకంలో ఇంటోక్లి వెళ్లి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన అందరికీ తెలిసిందే.

● తప్పించుకుంటున్న నిర్వాహకులు

గ్రామాల్లో బెల్టుషాపులు కొనసాగిస్తున్న నిర్వాహకులకు అటు నిజామాబాద్ ఇటు బోధన్ ప్రాంతాల నుంచి ఎక్సైజ్, టాస్క్ ఫోర్స్ ఇలా అక్రమ మద్యం విక్రయాలపై దాడులు చేసే ప్రత్యేక అధికార బృందం బయలు దేరిన వెంటనే ఇక్కడి నిర్వాహకులకు పక్కా సమాచారం అందుతోంది. దీంతో వారు ముందస్తు జాగ్రత్తగా మద్యం గొలుసు దుకాణాలను మూసి వేసి అధికారులకు దొరకకుండా తప్పించుకుంటున్నారు. దీంతో తనిఖీ అధికారుల బృందం ఇలా వచ్చి అలా వెళ్లిపోవడం పరిపాటిగా మారింది. బోధన్ డివిజన్‌లోని ఎడపల్లి మండలంలో అక్రమ మద్యం విక్రయాలపై వచ్చిన ఫిర్యాదులు వాటిపై తీసుకున్న చర్యలు, కేసులు నమోదు తదితర అంశాలపై సంబంధిత ఎక్సైజ్ శాఖ సీఐ వివరణ కోరగా ఆయన వివరాలు చెప్పేందుకు నిరాకరించారు. తమ వద్ద ఎలాంటి సమాచారం లేదని, తను అందుబాటులో లేనని చెప్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి బెల్ట్‌షాపులపై చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

బెల్ట్‌షాపులను మూయించాలి..

● సంతోష్ రెడ్డి, ఎడపల్లి

గ్రామంలో నిబంధనలకు విరుద్ధంగా మద్యం గొలుసు దుకాణాన్ని నడుపుతున్నారు. బెల్టుషాపును మూసివేయాలని నిర్వాహకుడికి ఎన్నిసార్లు కోరినా వినడంలేదు. ప్రజల ఇళ్ల మధ్యచ ప్రభుత్వ పాఠశాలలు, ఆలయాల వద్ద కొనసాగుతున్న మద్యం గొలుసు దుకాణాలపై చర్యలు తీసుకోవాలి. ఉన్నతాధికారులు వెంటనే స్పందించాలి.

నేడు రోడ్డు వెడల్పు కోసం ఎమ్మెల్యే ఇంటి కూల్చివేత

కామారెడ్డి టౌన్, జనవరి 26: కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని సైలాన్ బాబా కాలనీలోని రైల్వేగేట్ వద్ద గల కామారెడ్డి ఎమ్మెల్యే వెంకట రమణా రెడ్డి ఇంటి కూల్చివేత పనులు చేపట్టనున్నట్లు బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ కుంట లక్ష్మారెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కామారెడ్డి జిల్లా కేంద్రం అభివృద్ధిలో భాగంగా చేపట్టాల్సిన ప్రణాళికలో ముందుగా ఆయన ఇంటి వద్ద ఉన్న రోడ్డు వెడల్పు పనులతోనే ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. అయితే గత ప్రభుత్వంలో మున్సిపల్‌లోని అభివృద్ధి, రోడ్డు వెడల్పు పనులపై విమర్శలు వ్యక్తం చేయడంతో పాటు ప్రజలకు కలుగుతున్న ఇబ్బందులను ఎన్నోసార్లు ప్రతిపక్షంలో ఉండి ఎండగట్టారు. ప్రస్తుతం ఆయనే ఎమ్మెల్యేగా ఉండడం ప్రజలకు సౌకర్యాలను మెరుగుపరిచేందుకు తానే ముందుడగు వేసి స్వచ్ఛందంగా కూల్చివేతకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. మున్సిపల్ ప్రణాళిక ప్రకారం ఆయన ఇంటి వద్ద 80 ఫీట్ల రోడ్డు ఉండాల్సి ఉండగా ప్రస్తుతం ఆ రోడ్డు 40 ఫీట్లు మాత్రం ఉంది. ఆ రోడ్డును మరింత వెడల్పు చేసేందుకు గాను ఆయా చోట్ల ఆక్రమణలను తొలగించేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది.

నీటి కాలువలో పడి రైతు మృతి


కాలువలో పడి మృతి చెందిన ఆశిర్‌రెడ్డి

సదాశివనగర్, జనవరి 26: మండల కేంద్రానికి చెందిన రైతు మర్రి ఆశిర్‌రెడ్డి(49) నీటి కాలువలో పడి మృతి చెందినట్లు ఎస్ఐ రాజు తెలిపారు. ఉదయం 10 గంటలకు పంట పొలంలో నీరు పారించేందుకు ఇంటి నుంచి బయలుదేరి వెళ్లాడు. నల్లకుంట కట్ట వద్ద కాలువపై వేసిన ఇనుప స్తంభంపై వెళ్తుండగా ప్రమాదవశాత్తు కాలుజారి బురదలో పడిపోయి మృతి చెందాడు. మృతుడి భార్య చిన్నరాధవ్వ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

వరి పంటలను పరిశీలించిన ఏవో

బిచ్కుంద, జనవరి 26: రైతులు సాగు చేస్తున్న వరి పంటలపై అగ్గి తెగులు, గన్నె పురుగు ఆశించిందని మండల వ్యవసాయాధికారి రాజలింగం తెలిపారు. వరి నాట్లు వేసే సమయంలో తీవ్రంగా చలి ఉండడం, లేత దశలో ఉన్న వరినారు చచ్చిపోవడం, అగ్గి తెగులు ఆశించడంతో పచ్చదనం కోల్పోవడం జరిగిందన్నారు. రెండు రోజులుగా మళ్లీ చలి ప్రభావం ఉన్న దృశ్య రైతులందరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. పంటలపై ఆశించే పురుగుల నుంచి తీసుకోవాల్సిన జాగ్రత్తల విషయం వ్యవసాయ అధికారులను సంప్రదించాలని కోరారు.


క్రికెట్ టోర్నీని ప్రారంభిస్తున్న దృశ్యం

దేవునిపల్లిలో క్రికెట్ టోర్నీ

కామారెడ్డి రూరల్, జనవరి 26: గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని దేవునిపల్లి మాజీ సర్పంచ్ లద్దురి శివాజీ గణేష్ స్మారక క్రికెట్ టోర్నమెంట్‌ను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా నాయకులు లద్దురి లక్ష్మీపతి, రామ్‌కుమార్, నాగార్జునలు మాట్లాడుతూ దేవునిపల్లి గ్రామ పంచాయతీలో ఎన్నో ఏళ్లుగా ప్రజలకు అన్ని రకాల సౌకర్యాలు కల్పించి వారి మన్ననలను పొందిన మహా నాయకుడు శివాజీ గణేష్ అన్నారు. పరిపాలన హయాంలో ప్రజలకు సీసీ రోడ్లతో పాటు త్రాగునీటి వసతితో పాటు అనేక సంక్షేమ పథకాలు ప్రభుత్వం ద్వారా అందేలా చూశాడని తెలిపారు.అలాంటి వ్యక్తి మనమధ్యలో లేకపోవడం బాధకరమని ఆయన స్మారకంగా మూడు రోజుల పాటు యువకులకు క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నామని విజేతలకు రూ.10వేల నగదు బహుమతి అందించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఉరుదోండ నరేష్, శ్రీనివాస్, కృష్ణయాదవ్ తదితరులు పాల్గొన్నారు.


అమ్మకాలు జరుపుతున్న వారిని అడ్డుకుంటున్న గ్రామస్థులు

నకిలీ మందులను విక్రయిస్తున్న వారిని అడ్డుకున్న గ్రామస్థులు

రాజంపేట, జనవరి 26: మండలంలోని గుండారం గ్రామంలో శుక్రవారం ఇంటిఇంటికీ తిరుగుతూ పంటలకు పిచికారీ చేసే నకిలీ మందులను అమ్ముతున్న వారిని గ్రామస్థులు అడ్డుకున్నారు. మందులకు సంబంధించిన బిల్లులు, వాటికి రశీదులు లేకపోవడంతో అమ్మకందారులను నిలదీశారు. గ్రామాల్లో నకిలీ మందుల అమ్మకాలు జరగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. గ్రామాల్లో లైసెన్స్ లేకుండా అమ్ముతున్న వారిపై చర్యలు తీసుకోవాలని పేర్కొంటున్నారు.

CLASSIFIEDS

CHANGE OF NAME

I MUTHYAM PADMA (OLD NAME) R/O H.NO: 1-92, PURANIPET ROAD, BHEEMGAL, NIZAMABAD, TS. I HAVE CHANGED MY NAME AS MUTHYAM PADMAVATHI (NEW NAME) W/O MUTHYAM RAMESH

AJZ

Classifieds
మీ అభిమాన ఆంధ్రజ్యోతి దినపత్రిక కల్పిస్తోంది ఒక చక్కటి అవకాశం
ప్రతి రోజు... క్లాసిఫైడ్స్



పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

-: సంప్రదించవల్సిన నెంబరు :-
కామారెడ్డి : 9985411453

‘ఆంధ్రజ్యోతి’లో ఘనంగా గణతంత్ర దినోత్సవ వేడుకలు

నిజామాబాద్ జిల్లా డిచ్‌పల్లి మండలం ధర్మారం(బి) గ్రామంలో గల ‘ఆంధ్రజ్యోతి’ యూనిట్ కార్యాలయంలో శుక్రవారం 75వ గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. యూనిట్ బ్రాంచ్ మేనేజర్ నల్ల తిరుపతి రెడ్డి జాతీయ జెండాను ఎగుర వేశారు. ఈ వేడుకల్లో ఎడిషన్ ఇన్‌చార్జి గుడ్ల సంజీవ్ కుమార్, బ్యూరో ఇన్‌చార్జి పి.సంపత్‌రావు, ఏడీవీటీ అసిస్టెంట్ మేనేజర్ రాజేశ్వర్, అసిస్టెంట్ సర్క్యులేషన్ మేనేజర్ భాస్కర్, సబ్ ఎడిటర్ సుభాష్ చంద్ర, స్టాఫ్ ఫొటోగ్రాఫర్ రతన్, హెచ్‌ఆర్ రవి, సెక్యూరిటీ సిబ్బంది రాంచందర్ ఇతర విభాగాల సిబ్బంది పాల్గొన్నారు.






క్యాంపు కార్యాలయంలో జెండా ఎగురవేస్తున్న ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి


జెండా ఎగురవేస్తున్న ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు


వేడుకల్లో మాట్లాడుతున్న జుక్కల్ ఎమ్మెల్యే ఎమ్మెల్యే తోట రాములు

జిల్లాలో ఘనంగా గణతంత్ర వేడుకలు

కామారెడ్డి టౌన్, జనవరి 26: జిల్లా వ్యాప్తంగా 75వ గణతంత్ర వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. అన్ని రాజకీయ పార్టీలు, విద్యా సంస్థలు, కుల, యువజన, వ్యాపార, స్వచ్ఛంద సంఘాల ఆధ్వర్యంలో వాడ వాడల దేశ మువ్వన్నెల జెండాను ఎగురవేసి జాతీయ గీతాన్ని ఆలపించారు. రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్, స్వాతంత్ర సమరయోధులకు నివాళులు అర్పించి వారి సేవలను గుర్తుకు చేసుకున్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి జాతీయ జెండాను ఆవిష్కరించారు. మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ దేవేందర్ మున్సిపల్ చైర్‌పర్సన్ నిట్టుజాహ్నవితో కలిసి జెండా ఆవిష్కరించారు. మార్కెట్ కమిటీ వద్ద చైర్మన్ పిప్పిరి వెంకటి, వైస్ చైర్మన్ రవియాదవ్‌తో కలిపి జెండా ఆవిష్కరించారు. బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి జెండాను ఆవిష్కరించారు. బీజేపీ జిల్లా కార్యాలయం వద్ద జిల్లా అధ్యక్షురాలు అరుణతార జాతీయ జెండాను ఎగుర వేశారు. కాంగ్రెస్ జిల్లా కార్యాలయం వద్ద జిల్లా అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్‌రావు, నిజాం సాగర్ చౌరస్తాలోని ప్రాణహిత చేవెళ్ల సుజల స్రవంతి పైలాన్ వద్ద ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు ఐరేని సందీప్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. టీఎన్‌జీవోస్ కార్యాలయం వద్ద టీఎన్‌జీవోస్ జిల్లా అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి,కార్యదర్శి సాయిలు జెండా ఆవిష్కరించారు.ఏబీవీపీ ఆధ్వర్యంలో నగర అధ్యక్షుడు అనిల్‌రెడ్డి జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియ, కాంగ్రెస్, బీఆర్ఎస్, ,బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డి: పట్టణ కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఉదయం ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గ అభివృద్ధికి ముఖ్యమంత్రి ప్రత్యేకంగా 10 కోట్ల రూపాయలు మంజూరు చేశారన్నారు. అదే విధంగా నియోజకవర్గ అభివృద్ధికి మరో 70కోట్ల వరకు త్వరలో మంజూరు అవుతాయని నియోజకవర్గంలో ఎక్కడైనా సీసీ రోడ్డు, మురికికాలువలు, భవనాలు లేని గ్రామాలలో నిర్మించుకుని నియోజకవర్గాన్ని సస్య శ్యామలంగా చేస్తానని ఆయన అన్నారు. గత ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పులకుప్పగా చేసిందని రాబోయే రోజుల్లో టీఆర్ఎస్ పార్టీ నామ రూపాలు లేకుండా పోతుందని ఆయన అన్నారు. అనంతరం కల్యాణలక్ష్మీ, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో మన్నె ప్రభాకర్, తహసీల్దార్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు చెన్న లక్ష్మణ్, లింగాగౌడ్, గయాజుద్దీన్, ఆరీఫ్, చింతల శంకర్, ఆజార్ ఖాద్రి, గోపి కృష్ణ, సంపత్‌గౌడ్ పాల్గొన్నారు.

లింగంపేట: గణతంత్ర దినోత్సవం సందర్భంగా శుక్రవారం మండల కేంద్రంలో స్థానిక ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు జాతీయ జెండాను ఆవిష్కరించారు. అదేవిధంగా కాంగ్రెస్ కార్యాలయం, ఎంపీడీవో ఆఫీస్, ఐకేపీ జాతీయ జెండాను ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సుధాకర్, ఎస్ఐ ప్రభాకర్, మెడికల్ ఆఫీసర్ హిమబిందు, ట్రాన్స్‌కో ఏఈ సాయినాథ్, రాజకీయపార్టీల లీడర్లు జాతీయ జెండాలను ఆవిష్కరించారు.

మద్నూర్: మండలంలో ఉన్న వ్యాపారులు ఈ ప్రాంతంలో వ్యాపార అభివృద్ధికి తనవంతు కృషిచేసి, మండలానికి పూర్వ వైభవం తెస్తానని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంత్ రావు అన్నారు. మండల కేంద్రంలో తహసీల్దార్ కార్యాలయం వద్ద జరిగిన గణతత్ర వేడుకల్లో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో తహసీల్దార్ ముజీబ్, ఆర్ఐ శంకర్, మద్నూర్ సర్పంచ్ దరాస్ సురేష్, తదితరులు పాల్గొన్నారు.

మద్నూర్: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన జాతీయ జెండా ఆవిష్కరణ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే హన్మంత్ షిండే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జుక్కల్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ ప్రభుత్వం అన్ని వర్గాల వారికి అభివృద్ధి చేసి, రోడ్డు సౌకర్యం కల్పించిందని, తాగునీటి కోసం ఇంటింటికిమిషన్ భగీరథ ద్వారా నీళ్లు అందించారన్నారు. ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు అందజేశారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ లక్ష్మీబాయి, ఎంపీడీవో రవీశ్వర్ గౌడ్, ఉద్యమ నాయకుడు హన్మాండ్లు మేస్త్రి, నగేష్ పాల్గొన్నారు.

నసురుల్లాబాద్: మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాలలో శుక్రవారం గణతంత్ర వేడుకలను విద్యార్థులు, అధికారులు, నాయకులు ఘనంగా నిర్వహించుకున్నారు. పాఠశాల విద్యార్థులు వీధుల గుండా ర్యాలీ నిర్వహిస్తూ జై జవాన్ జైకిసాన్ నినాదాలతో వీధులన్నీ మార్మోగాయి. తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ రాజు, పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ లావణ్య, ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ విఠల్, గ్రామ పంచాయితీలో సర్పంచ్ అరిగె సాయిలు, సొసైటీ చైర్మన్ గంగారాం, ఐకేపీ కార్యాలయంలో ఏపీఎం సత్యనారాయణ, మండలంలోని ఆయా ప్రభుత్వ ప్రైవేట్ పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులు, అంగన్‌వాడీ సెంటర్‌లో అంగన్‌వాడీ టీచర్లు, గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని మూడు రంగుల మువ్వన్నెల జెండాను ఎగురవేశారు.

బీర్కూర్: మండల వ్యాప్తంగా గణతంత్ర వేడుకలను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో తహసీల్దార్ లత జెండాను ఆవిష్కరించారు. ఆయా శాఖల అధికారులు తమతమ కార్యా లయాలు, సర్పంచ్‌లు జాతీయ జెండాను ఆవిష్కరించారు.

నిజాంసాగర్ (మహ్మద్‌నగర్): నిజాంసాగర్, మహ్మద్‌నగర్ మండలాల్లో శుక్రవారం గణతంత్ర వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఎంపీడీవో కార్యాలయం వద్ద ఎంపీపీ జ్యోతి దుర్గారెడ్డి, తహసీల్దార్ కార్యాలయం వద్ద తహసీల్దార్, పోలీస్ స్టేషన్‌లో ఎస్సై, ఆయా ప్రభుత్వ ప్రైవేట్ పాఠశాలల వద్ద ప్రధానోపాధ్యాయులు, ఆయా గ్రామ పంచాయతీల వద్ద సర్పంచులు జెండాను ఆవిష్కరించారు.

దోమకొండ: మండల కేంద్రంతో పాటు అన్ని గ్రామాల్లో శుక్రవారం గణతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ సంజయ్‌రావు, అబ్కారీ సీఐ కార్యలయంలో సీఐ మధుసుదన్‌రావు, ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో చిన్నారెడ్డి, పోలీస్ స్టేషన్‌లో ఎస్సై మురళి, ఏవో పవన్ కుమార్, వివిధ పార్టీల అధ్యక్షులు, జెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో ఎంపీపీ కానుగంటి శారద, నాగరాజు, సర్పంచ్ నల్లపు అంజలి, శ్రీనివాస్, మధుసుదన్‌రావు, అనంత్‌రెడ్డి, రాజేష్, అధికారులు, నాయకులు,ప్రజలు పాల్గొన్నారు.

బాన్సువాడటౌన్: పట్టణంలో గణతంత్ర వేడుకలను ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలు, కార్యాలయాలు, యూనియన్ల కార్యాలయాలు, వివిధ రాజకీయ పార్టీల కార్యాలయాల్లో అధికారులు, నాయకులు జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఎమ్మెల్యే క్యాంపు ఆఫీసులో బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి జాతీయ జెండాను ఆవిష్కరించారు. మున్సిపాలిటీ కార్యాలయంలో కమిషనర్ రమేశ్, ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో సత్యనారాయణరెడ్డి, ఆర్డీవో కార్యాలయంలో ఆర్డీవో భుజంగరావు, తహసీల్ కార్యాలయంలో తహసీల్దార్ వరప్రసాద్, వ్యవసాయ మార్కెట్ కమిటీ, కాంగ్రెస్, బీజేపీ కార్యాలయాల్లో జాతీయ జెండాను ఆవిష్కరించి, జాతీయ గీతాన్ని ఆలపించారు.


జెండా ఆవిష్కరణలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే హన్మంత్ షిండే

బిచ్కుంద: మండలంలోని గ్రామాలతో పాటు ప్రభుత్వ కార్యాలయాల్లో గణతంత్ర వేడుకలను ఘనంగా నిర్వహించారు. శుక్రవారం గణతంత్ర దినోత్సవం సందర్భంగా పోలీసుస్టేషన్ గ్రామపంచాయతీ, తహసీల్దార్ కార్యాలయంతో పాటు ఆయా శాఖలలో అధికారులు జాతీయ జెండాను ఎగురవేసి గౌరవ వందన స్వీకరించారు. బీఆర్ఎస్ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే హన్మంత్‌షిండే, కాంగ్రెస్ కార్యాలయంలో గంగాధర్, ఆయా కార్యాలయాలలో అధికారులు జెండా ఆవిష్కరించారు.

భిక్కనూరు: మండలంలోని అన్నిగ్రామాల్లో శుక్రవారం గణతంత్ర వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భిక్కనూరు ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ గాల్‌రెడ్డి, తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ శివప్రసాద్, మార్కెట్ కమిటీ ఆవరణలో వైస్‌చైర్మన్ రాజమౌళి, పోలీసుస్టేషన్‌లో ఎస్సై సాయికుమార్, భిక్కనూరు సౌత్‌క్యాంపస్‌లో ప్రిన్సిపాల్ సుధాకర్‌గౌడ్, ఆయా గ్రామపంచాయితీ కార్యాలయాల వద్ద సర్పంచ్‌లు, పార్టీ కార్యాలయాల వద్ద పార్టీ మండల అధ్యక్షులు, కులసంఘాలు, యువజన సంఘాల ప్రతినిధులు, పాఠశాలల్లో హెచ్‌ఎంలు జాతీయ పతకాన్ని ఎగురవేసి జాతీయగీతాన్ని ఆలపించారు. గణతంత్ర దినోత్సవ వేడుకల్లో బాగంగా విద్యార్థుల వేషాధారణలు, సాంస్కృతిక కార్యక్రమాలు, ఎన్‌సీసీ విద్యార్థులు పరేడ్ ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో వైస్‌ఎంపీపీ యాదగిరి, ఎంపీడీవో అనంత్‌రావు, ఎంపీవో ప్రవీణ్‌కుమార్, ఆయాపార్టీల మండల అధ్యక్షులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు, యువజనసంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

గాంధారి: మండలంలో గణతంత్ర వేడుకలను ఘనంగా నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయంలో జెండా ఆవిష్కరించారు. ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ రాధ బలరాంనాయక్, గాంధారి గ్రామపంచాయతీ ఆవరణలో సర్పంచ్, సింగిల్‌విండో కార్యాలయంలో చైర్మన్ సాయికుమార్, మండల అధ్యక్షుడు శివాజీరావు, బీజేపీ మండల అధ్యక్షుడు సాయిబాబా, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మోహన్‌నాయక్ వివిధ కార్యాలయాల ఆవరణలో జెండాను ఆవిష్కరించారు.


నసురుల్లాబాద్‌లో జెండాను ఆవిష్కరిస్తున్న తహసీల్దార్


బీర్కూర్‌లో జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న తహసీల్దార్


బీబీపేట ఎంపీడీవో కార్యాలయం వద్ద జెండా ఆవిష్కరించిన దృశ్యం

ప్రతీ నాయకుడు నిజాయితీ, చిత్తశుద్ధితో పని చేయాలి

● ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి


ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జెండా ఆవిష్కరిస్తున్న పోచారం శ్రీనివాస్‌రెడ్డి

బాన్సువాడ, జనవరి 26: భారతదేశంలో అన్ని వనరులు ఉన్నాయని, నిజాయితీ, చిత్తశుద్ధితో నాయకులు పనిచేస్తే దేశంలో పేదరికాన్ని నిర్మూలించవచ్చని మాజీ స్పీకర్, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మొదటిసారిగా జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశానికి స్వాతంత్రం వచ్చిన తర్వాత పరిపాలన ఏ విధంగా ఉండాలో తెలిపేందుకు రాజ్యాంగ నిర్మాణం డా. బాబా సాహెబ్ అంబేద్కర్ ఆధ్వర్యంలో చేపట్టడం జరిగిందన్నారు. నేటి రోజుల్లో కులాలు, మతాల పేరుతో రాజకీయాలు చేస్తున్నారే తప్ప ఆలోచించి ప్రజల కోసం పనిచేసే నాయకులు చాలా తక్కువగా ఉన్నారన్నారు. వివిధ హోదాల్లో ఉన్న నాయకులు మనిషి కనీస అవసరాలను తీర్చే విధంగా నిర్ణయాలు తీసుకోవాలన్నారు. తాను ప్రజల కోసం పని చేశాననే ప్రజలు మంచి మెజార్టీతో బాన్సువాడ ఎమ్మెల్యేగా గెలిపించారన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా గల్లీగల్లీకి తిరుగుతానని, తాను చేసిన పనులను ప్రజలకు వివరిస్తానన్నారు. రాజాంగ స్ఫూర్తితో నాయకులు పని చేయాలని, ప్రజలకు మంచి చేసినప్పుడే మంచి నాయకుడిగా ఎదుగుతారన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో భుజంగరావు, జిల్లా రైతు బంధు అధ్యక్షుడు అంజిరెడ్డి, మున్సిపల్ చైర్మెన్ జంగం గంగాధర్, ఏఎంసీ చైర్మెన్ నెర్రె నర్సింలు, ఎంపీపీ దొడ్ల నీరజా వెంకట్‌రాంరెడ్డి, జడ్పీటీసీ పద్మగోపాల్‌రెడ్డి తదితరులున్నారు.

సినిమా గైడ్ కామారెడ్డి



కామారెడ్డి

దర్శన్	- హనుమాన్
శాంతి	- గుంటూరు కారం
ప్రియ 70	- క్యాప్టెన్ మిల్లర్
ప్రియ 35	- అయాలన్

బాన్సువాడ

మహేశ్వరి	- గుంటూరు కారం
వెంకటేశ్వర	- హనుమాన్

చికెన్ ధరలు



రకం	:	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	:	100	160	180
వెన్‌కాబ్(కిలో)	:	100	180	210

